# " ఊరు నవ్వుతోంది "

చెప్పులు వేసుకుని వసారా మెట్లు దిగి వెళ్తున్న విశ్వనాధాన్ని ఉద్దేశించి అన్నాడు ఉమాపతి.

" నేనీ పూట వెళ్ళిపోతున్నానన్నయ్యా ! "

విశ్వనాధం ఒక్క-క్షణం ఆగాడేగానీ, వెనక్కు- తిరిగి తమ్ముడివేపు చూడలేదు.

" నువ్వు పొలంనుంచి వచ్చేసరికి ట్రెయిన్‌కు టైమయిపోతుందేమో ? " అన్నయ్యకు తన మాటలు సరిగా వినిపించ లేదేమో నన్నట్లు మళ్ళీ అన్నాడు ఉమాపతి.

" నువ్వు వెళ్ళటానికీ, నేను పొలంనుంచి రావటానికీ సంబంధమేమిటిరా ఉమాపతీ ! నీ టైంకు భోజనం అదీ మీ వదిన చూస్తుంది. మనపాలేరు వెంకన్న బండి కడతాడు. వెళ్ళు ! . . . " ఎంత సౌమ్యంగా ఆ నాలుగు ముక్క-లూ అనాలని ప్రయత్నించినా, గొంతుక వరకూ ఎగసి వస్తున్న కోపం, బాధ, నిరాశ, కలిసికట్టుగా కాఠిన్యాన్నే కురిపించాయి.

ఇక ఉమాపతికి అవకాశ మివ్వకుండా చరచర ముందుకు సాగాడు విశ్వనాధం. వరి చేలోకి దిగి కొడవళ్లు నూరుకుంటూ తన రాక కోసం ఎదురు చూస్తున్నారు కూలీలు.

" ఊఁ ! కోత మొదలెట్టండి ! " గట్టుమీద కూర్చుంటూ అన్నాడు విశ్వనాధం.

పండిన వరిచేను క్రిందికి వాలి వుంది. "ఈభారం నేనిక మోయ లేను. నాకు విముక్తి ప్రసాదించు. . ." అని నిండు చూలాలు భగవంతుడి ముందు మోకరిల్లినట్లుంది !

విశ్వనాథానికి నవ్వొచ్చింది. ఇవన్నీ తన ఆలోచనలు .... ఊహాలు .... నిజంగా చేను అలా అనుకొంటోందా ?

ఏం ? ఎందుకనుకో కూడదు ? ఈ ప్రకృతిలోని సకల ప్రాణి కోటికీ, సజీవ చైతన్యానికీ ఒక్కో రకమైన సాంకేతిక భాషంటూ ఉండి వుంటుంది. ఉండి తీరాలి ! పశువులకూ, మొక్కలకూ వృక్షాలకూ, ఒక టేమిటి, క్రిమి కీటకాదుల నుంచి, ప్రతి సజీవరాశికీ భాష వుంది ! ఒక చిన్న బెల్లంముక్కను చూచిన చీమ మరు నిముషంలో వేలాది చీమలను చేర్చటంలో 'భాష' లేదూ ? సముద్రతీరాన నివసించే కొన్ని జాతుల పక్షులు, సముద్రతీరంలో గ్రుడ్లు పెడతాయి ! సముద్రానికి ఆటూ పోటూ వస్తుందని గ్రహించేశక్తి వాటికి వుంటుందిట....అది తెలియగానే అవి తమ గ్రుడ్లను జాగ్రత్త పరుచుకుంటాయట ! వాటికి భాష లేదూ ? తుఫాను రాకను పక్షులు గ్రహించగలవు ! పశువులూ అంతే ! వృక్షాలు అంతే !

అయితే, అవేవీ, మాటల రూపంలో తమ భావాలను వ్యక్తం చేయలేవు.... అంతే ! మాటలూ, మేథ వున్న మనిషి అక్షర రూపంలో చేస్తున్న అక్రమాలూ, నిర్లక్ష్యాలూ అవేవీ చేయటం లేదు.

విశ్వనాథం ఆలోచనలు దూకుడుగా గతంలోకి దూసుకుపో తున్నాయి. క్షణకాలం యింటి దగ్గర ఆగాయి....

ఈరోజు తన ఆఖరు తమ్ముడు ఉమాపతి వెళ్ళిపోతున్నాడు. ఇందాకా తనలో మినుకు మినుకుమంటున్న ఆశాకిరణాన్ని, పూర్తిగా ఆర్పి వేసి మరీ వెళ్తున్నాడు వాడు !

తిరిగి ఆలోచనలు....బాగా గతంలోకి లాక్కు వెళ్ళాయి.

* * * * *

విశ్వనాథం తండ్రి నీలకంఠంగారు చనిపోయే ముందు, స్కూలు ఫైనల్ చదువుతున్న పెద్దకొడుకు విశ్వనాథాన్ని దగ్గరకు పిలిచి, మిగతా నలుగురు కొడుకుల పెంపకం బాధ్యతా, పల్లెటూరులో పాలకుండలాటి కమతాన్నీ అప్పగించారు. చిన్నప్పట్నుంచీ విశ్వనాథానికి పల్లెటూరి వాతావరణమన్నా, పొలం పనులన్నా, పశువులన్నా ఎంతో మక్కువ. అంతే కాదు ...

"నేను పుట్టిన వూరిది. నాకు ఏడవటం, నవ్వటం, మాట్లాడటం ఒకటేమిటి? నా ప్రతి కదిలికకూ జీవం పోసిన గడ్డ యిది. కన్న తల్లి మానవస్త్రీ అయితే, పెంచిన తల్లి ఈ ప్రకృతి తల్లి. ఈ నా గ్రామం ఋణం తీర్చుకోవటమూ నా కనీస బాధ్యతలలో ఒకటి!"

అంతటి పెద్ద-పెద్ద మాటలలో కాకున్నా, అస్తమానూ అలా ఆలోచిస్తుండే వాడు విశ్వనాథం.

ఊళ్లో ఎలిమెంటరీ స్కూలు మాత్రం వుంది. అదైనా ఓ పూరి పాక, ఒక్కడే పంతులు. ఆ వూరి పాకలో పగటివూట బడి చెబుతారు. బళ్ళోపాఠాలు కాదు చెప్పేది! పంతులుగారు కొందరు పిల్లల్ని కట్టె పుల్లలు తెమ్మని తోలేస్తాడు. మరి కొందర్ని కూరగాయలు పట్టుకు రమ్మని తరిమేస్తాడు. మిగిలిన నలుగురో ముగ్గురో పిల్లలు పంతులుగారి భార్యకు నీళ్లు మొయ్యటానికి కేటాయించబడతారు! పంతులుగారు మాత్రం హాయిగా బాసింపట్టు వేసుక్కూర్చుని బీడి తాగుతూ, ఊళ్లోని పనిలేని యువకులతో చీట్లాట ఆడుతుంటారు!

ఇక ఆ పాకలో రాత్రివేళ, కాస్త మబ్బు పట్టి చినుకులు పడ్డాయీ అంటే, చుట్టు ప్రక్కల ఇళ్ళ వాళ్ళు తమ గొర్రెల్నీ, గేదెల్నీ, కోళ్ళనీ తోలుతారు. అంచేత పగటి పూట ఆ బడిలో కూర్చుంటే చెడ్డవాసన! ఇక వర్షాకాలం సరే సరి! అడుగు పెడితే, అడుగున్నర లోతుకు దిగబడిపోయేలా నీళ్ళు నిలుస్తాయి బడిలో! అంచేత అసలు బడే వుండదు!

విశ్వనాధం రెండో క్లాసు చదువుతున్నప్పుడు (అలా అనుకుంటు న్నప్పుడు) అతగాడి మేనత్త కొడుకు రామం బస్తీనుంచి వచ్చాడు. విశ్వ నాధం చదువుతున్న బడి చూచి పొట్టచెక్కలయ్యేలా నవ్వాడు.

"ఇదా మీ బడి? మా స్కూలు చూడు ఒక్కమారు వచ్చి! మాంచి బిల్డింగు. చుట్టూరా తోట! చక్కగా కూర్చోవటానికి మాకు బెంచీలు! నీకింకా అక్షరాలు సరిగా రాలేదు. నాకు యింగ్లీషు అక్షరాలుకూడా వచ్చే శాయి!" అంటూ వాడు గొప్పగా చెబుతూంటే—

ఏదో ఈర్ష్యలాటి భావంతోబాటు విశ్వనాధం చిన్న బుర్రలో"నేను పెద్దయ్యాక చూసుకో....మీ స్కూలు తాతలాటి స్కూలు కట్టిస్తాను మా వూళ్లో!" అన్న దృఢమయిన కోరికా, పట్టుదలా తన్నుకు వచ్చాయి విశ్వనాధానికి!

అయిదో క్లాసు చదువుతూండగా, అవతలి వీధిలోని కోమట్ల అమ్మాయి సుబ్బులు ప్రసవించలేక చనిపోయింది. ఆరోజు రాత్రే తమ యింటి గేదె కూడా ఈనలేక చనిపోయింది!

అది చనిపోబోతూ మూలిగిన మూలుగులూ, తన్నుకున్న కాళ్ళూ, తేలవేసిన కళ్ళూ విశ్వనాధం చిన్ని గుండెలో గునపాలు దింపాయి!

అవును సుబ్బులు చనిపోయింది. వెర్రికేకలు వేసింది. అందరూ ఏడ్చారు. మరి గేదె చనిపోయింది. రేపట్నుంచీ పాలకు యిబ్బంది పడ బోతామన్న ఏడుపే తప్ప, సుబ్బులుకు లానే అది కూడా తమ వూళ్ళో డాక్టరు లేనందువల్ల చనిపోయిందని ఒక్క రన్నారా?

ఊహూఁ! మనుషుల ఆస్పత్రి వుంటే సుబ్బులు బ్రతికేది! పశువుల ఆస్పత్రి వుంటే గేదె బ్రతికేది! తను పెద్దయ్యాక తప్పకుండా మనుషులకూ, పశువులకూ ఆస్పత్రులు ఈ వూళ్లో వుండేలా చూడాలి!

అత గాడి హృదయంలో మరో నిశ్చయం మొక్కలా లేచి ప్రూనై కూర్చుంది.

ఎలిమెంటరీ స్కూలు చదువు పూర్తయి బస్తీలో హైస్కూల్లో అడుగెట్టాక, విశ్వనాథంలో తన వూరిని గురించిన ఆలోచన మరింత జాస్తయ్యింది. ఈ బస్తీలలో ఎన్ని తమాషాలున్నాయి ! కార్లు,బస్సులు, పార్కులు, ఎలక్ట్రిక్ లైట్లు....ఒక టేమిటి ? ఎన్నో-మరెన్నో ! బస్తీలకు పక్క పక్కగా వున్న పల్లెటూళ్ళకు కూడా యీ సౌక్యారాలలో చాలా వున్నాయి ! ఓ మూలగా విసరివేయబడినట్లున్న తన వూరికే యివేవిలేవు! తను పెద్ద చదువు చదివి - స్కూల్ ఫైనల్‌లో అడుగెట్టాడో లేదో తండ్రికి హఠాత్తుగా జబ్బు చేయడమూ, ఆయన కొద్దిరోజులు మంచంలో వుండి మరణించటమూ జరిగిపోయింది ! చదువు ఆపి వేయక తప్పలేదు.

* * * * *

ఇంటి దగ్గర వ్యవసాయం, లోకం అంటే తెలియని నలుగురు తమ్ముళ్లు, దిగులుతో కృంగిపోయి వున్న తల్లి.... విశ్వనాథం. ఆశలనూ, ఆలోచనలనూ మొదలంటా నరికి వేశారు !

ఎలాగో ధైర్యం కూడకట్టుకున్నాడు. "నేనే చెయ్యాలని ఏముందీ! నాతరువాత నలుగురు తమ్ముళ్లున్నారుగదా ? వాళ్ళందర్నీ బాగా చదివిస్తాను. గొప్పవాళ్ళని చేస్తాను. వాళ్ళందరూ తల్చుకోవాలే గానీ, ఈ వూరు.... ఈ వూరేమిటి ఖర్మ ఈ ప్రపంచమే ఎలా కావాలి అంటే అలా మార్చి వేయరూ ?" అనుకున్నాడు.

పెద్దతమ్ముడు గంగాధరాన్ని డాక్టరుకోర్సు గానీ, వెటర్నరీ డాక్టరు కోర్సు గానీ చదవమన్నాడు.

"ఆ కోతలూ, కుట్లూ, కట్లూ, నావల్ల కాదన్నయ్యా ! హాయిగా లాయరౌతాను !" అన్నాడు గంగాధరం.

"పోన్లే! మన వూరికి న్యాయం జరగాలంటే మన వాడివి నువ్వుంటావ్!" అనుకుని సమాధాన పడ్డాడు విశ్వనాథం.

చదువు పూర్తి చేసుకుని, బస్తీలో ప్రాక్టీసు పెట్టాడు గంగాధరం. కొద్ది నెలల్లోనే మంచి లాయరుగా పేరు తెచ్చుకున్నాడు కూడా.

ఓ రోజు, తన వూరి పొలిమేరల్లో, గడ్డి కోసుకుంటున్న రత్నం లాటి రత్నమ్మ-పెళ్ళికాని అమాయకురాలు .... ఇక్కణ్నుంచీ ఆ బస్తీకి కాపురం ఎత్తేసిన లక్షాధికారి రెడ్డిగారబ్బాయీ, అతగాడి స్నేహితులు కొందరూ కలిసి తాగిన మైకంతో, డబ్బున్న హజంతో రత్నమ్మను సర్వ నాశనం చేసి, ప్రాణాలు తీసేశారు! పూట గడవటమే కష్టంగా వున్న శేషాద్రి—రత్నమ్మ తండ్రి, కూతురి శవాన్ని చూచి గుండెలు పగిలేలా ఏడుస్తుంటే విశ్వనాథం హృదయం ద్రవ్యమైపోయింది!

"శేషాద్రీ! నీ బిడ్డయితే ఒకటీ, నా బిడ్డయితే ఒకటీ కాదు. నీ బిడ్డ మాన ప్రాణాల్ని బలి తీసుకున్న ఆ కసాయి వెధవల్ని ఉరికంబ మెక్కిస్తాను-పద....కొండలాటి నా తమ్ముడున్నాడు. న్యాయం మన ప్రక్క నుంది!" అంటూ ఆవేశంతో ఊగిపోయి, శేషాద్రిని వెంట పెట్టుకొని గంగాధరం దగ్గరకు వచ్చి కేసు పెట్టించాడు విశ్వనాథం.

కానీ-కానీ....ఎన్నో సాక్ష్యాధారాలున్న కేసు కాస్తాపుసుక్కున కొట్టి వేయబడింది! ముద్దాయీలు అమాయకులనీ, రత్నమ్మ ఆ సరికే చెడి పోయిన స్త్రీ అనీ, ఆమె మరణం కేవలం ఆత్మహత్య అనీ- తేల్చి వేయబడింది.

"నా దురదృష్టం! నా బిడ్డ ఖర్మ!" అని సరి పెట్టుకున్నాడు శేషాద్రి.

కానీ విశ్వనాథం నిలువునా కుప్పలా కూలిపోయాడు! నెల తిరక్కుండా గంగాధరం బంగళాలాటి ఇల్లు, పెద్ద పడవలాటి కారూ కొన్నాడని తెలిసినరోజు ....

'తమ్ముడూ! గంగాధరం! శేషాద్రి అమాయకుడు.... నిజం అతనికి తెలియలేదు. కానీ నాకు తెలుసు, కేసు ఎందుకలా తారుమారు అయ్యిందో! మానవత్వం చచ్చిన నువ్వు.... మన వూరిని.... కాదు-కాదు నా వూరిని ఉద్ధరిస్తావనుకోవటం.... ఛ-ఛ నా పొరబాటు!' అనుకుని లోలోపల ఏడ్చాడు.

* * * * *

రెండో తమ్ముడు శశిధర్ తనకు ఉద్యోగం చేయాలని లేదనీ, ప్రజాసేవే తన జీవిత ధ్యేయమనీ, దేశాన్ని బాగుపరచటమే తన ప్రథమ కర్తవ్యమనీ, ముఖ్యంగా గ్రామాభివృద్ధి తన వూపిరనీ, అందుకుగానూ 'రాజకీయాలనే' కంకణం ధరిస్తాననీ చెప్పిన రోజు.... విశ్వనాథం పొంగిపోయాడు. ఇక తన ఊరు అమరావతిలా మారిపోవటానికి ఎంతో కాలం వేచి వుండనవసరం లేదనిపించింది.... శశిధర్ రాజకీయాలలో దిగి ఒక్కో మెట్టు ఎగబ్రాకడానికి, ఓపినంత సాయంచేశాడు. తన గ్రామస్థులందరి చేతా చేయించాడు. తన పలుకుబడినీ, మంచితనాన్నీ పణంగా ఒడ్డాడు.

శశిధర్ ఎం. ఎల్. ఏ అయ్యాడు. త్వరలోనే మినిష్టరు కాబోతున్నాడు కూడా! కానీ వూరి వూసు ఎత్తక పోవటంతో ఆశ్చర్యం కలిగింది విశ్వనాథానికి. ఉత్తరాలు వ్రాశాడు. ఊరి వాళ్ళందరిచేతా సంతకాలు చేయించి, మనవి చేసుకున్నాడు. చివరకు రాజధాని వరకూ వెళ్ళి స్వయంగా మనవి చేసుకోవటానికి బయల్దేరాడు.

"మన వూరికి హైస్కూలూ.... స్కూలు బిల్డింగూ.... రోడ్డు...." ఇంకా విశ్వనాథం మాటలు పూర్తి కాక ముందే — శశిధర్ గంభీరంగా 'ఇక అప' మన్నట్లు సైగ చేశాడు.

అతగాడీ మధ్య 'పుచ్చుకొంటు' న్నాడని ఎవరో చెబితే విశ్వ నాధం నమ్మలేదు. కానీ యిప్పుడు మత్తుగా వుబ్బివున్న కళ్ళనీ, నవ్వుతు న్నప్పుడు బండల్లా విచ్చుకుంటున్న అతగాడి పెదవుల్నీ, ముద్ద మాటల్నీ విన్నాక 'వీడేనా శశిధరం ?' అని అనుమానించక తప్పలేదు.

"ఎందుకన్నయ్యా ! ఆ వూరిని గురించి అలా కొట్టుకుంటావ్ ? హాయిగా ఆ 'ప్రాపర్టీ' అమ్మిపారేసి, ఇక్కడికి రా ! ఏ బిజినెస్సో.... నీ పేరిట లైసెన్స్ ఇప్పిస్తాను. లక్షలార్జించవచ్చు. వెధవ్వూరు ! ఏముం దక్కడ ? ఓ తెలివా ? తేటా ? చదువా ? సంస్కారమా ? సుఖమా ? సంతోషమా ? పశువులకూ, మనుషులకూ తేడా వుందా అసలు ? అన్నాడు చిరాగ్గా.

విశ్వనాధం బుర్ర గిర్రున తిరిగింది. "ఉందిరా తమ్ముడూ! ఉంది. ఆ తేడా ఏమిటో నాకీ క్షణంలో స్పష్టంగా తెలుస్తోంది. మేత పెట్టిన మనిషికి, తమబిడ్డల నోటికాడి పాలు ఇచ్చేస్తున్నాయి పశువులు ! తిండి పెట్టిన మనిషికి వెట్టిచాకిరీ చేస్తున్నాయి అవి ! తిట్టినా కొట్టినా వులకటం లేదు, పలకటం లేదు. మరి అవి పశువులు ! నువ్వు మనిషివి. నీకు పలుకుబడి వుంది, పదవి వుంది, బోలెడంత తీరిక వుంది ! అయినా నువ్వు పుట్టిపెరిగిన వూరిని—కాస్త బాగు చెయ్యటానికి ఓపిక లేదు ! నువ్వు పుట్టిన గడ్డంటే నీకీపాటి అభిమానం వుంది ! దాని అభివృద్ధికి ఇంతోటి సాయం చేస్తున్నావు ! ఇక ఉద్ధరింపు కోసం....పాపం ఇతర గ్రామాలూ, దేశమూ ఏడుస్తున్నాయి కాబోలు ! మరి వస్తా !...." అన్నాడు ఆవేశంగా.

"మా అన్నయ్యకు కొద్దిగా 'మెంటల్‌షాక్' వచ్చిందామధ్య. ఇంకా పూర్తిగా కోలుకో లేదు. ఇక్కడుండి మందు తీసుకోమంటే

వివడు!" తన వెనకాల శశిధర్ అతగాడి 'భక్త బృందం' తో అంటూంటే.—

వెన్ను ఎవరో విరిచేసినట్లయ్యింది విశ్వనాథానికి. ఆ క్షణంలోనే అతగాడి ఆశల విహంగానికి రెక్కలు విరిగి పోయాయనిపించింది.

* * * * *

మూడో తమ్ముడు చంద్రశేఖరాన్ని "వెటర్నరీ డాక్టరు కోర్సు చదువుతావుట్రా!" అని అడిగాడు విశ్వనాథం, పట్టు వదలని విక్రమార్కుడిలా.

చంద్రశేఖరం త్రుళ్ళి పడ్డాడు, ఏదో వినరాని మాట విన్నట్టు కంపరంగా చూశాడు అన్న వేపు! "పోయి పోయి పశువుల డాక్టర్ని కావాలా? అసలు వాటి కోసం యింత చదువు చదవాలా? నేను మామూలు డాక్టర్ కోర్సు చదువుతాను!"

క్షణ కాలం తన చిన్నప్పుడు చనిపోయిన గేదె—దాని బాధ కళ్ళ ముందు మెదిలాయి! ఈ మధ్యకాలంలో కూడా ఎందరో మనుషులు, మరెన్నో పశువులూ, సరైన వైద్యసౌకర్యం లేక చనిపోయారు!

బాధ ఒక్కటే! ప్రాణం ఒక్కటే!.... కానీ బాధ వ్యక్తం చేసుకోగల మనిషి ప్రాణానికున్న విలువ, వ్యక్తం చేసుకోలేని పశువు ప్రాణానికి లేదు. "పోనీ, వాడిష్ట ప్రకారమే కానీ! ఇక్కడ మనుషుల ఆస్పత్రి అయినా వెలుస్తుంది!" అనుకుని రాజీ పడ్డాడు విశ్వనాథం.

చంద్రశేఖరం డాక్టర్ కోర్సు పూర్తిచేసుక వచ్చిన రోజు....

"ప్రస్తుతానికి వెనక వేపున్న రెండు గదుల్లో మేము సర్దుకుంటాం. ఈ ముందు భాగమంతా నువ్వు ఆస్పత్రిగా వాడుకో! వీలుచూచుకుని, మరోరెండు రూములు వేయిస్తాను!" అన్నాడు ఉత్సాహంగా విశ్వనాథం.

చంద్రశేఖరం యిబ్బందిగా ముఖం పెట్టాడు. "ఈ వెధవ వూళ్ళో ప్రాక్టీసు పెట్టి పైసా సంపాదించలేనన్నయ్యా! డబ్బున్న వాడొక్కడూ లేడు. ఖర్మకొద్దీ, వీళ్ళకొచ్చే రోగాలేమో వీళ్ళకొచ్చే తాహతుకు మించి నవి! నేనిక్కడ డాక్టరుగా వుంటే మొహమాటం కొద్దీ, వుట్టినే వైద్యం చేయాల్సి వుంటుంది. ఊహూఁ! ఈ రోజుల్లో డబ్బు సంపాదించలేని వాడూ, చచ్చిన వాడూ ఒకటే! అందుకే నేను సిటీలో ప్రాక్టీస్ పెడ తాను. నాక్కాబోయే మామగారు అందుక్కావలసినంత డబ్బిస్తామన్నారు కూడాను...."

స్థాణువడి నిల్చుని వున్న విశ్వనాథాన్ని చూస్తూ, చంద్రశేఖరం జాలిపడ్డాడు. దగ్గరగా వచ్చి అన్నయ్య భుజంమీద ఆప్యాయంగా చేయి వేస్తూ, జాలిగా చూస్తూ అన్నాడు. "అన్నయ్యా నీకు నాదో చిన్న సలహా! పుట్టిన వూరినే కనిపెట్టుకూర్చున్న వాడెవడూ బాగుపడడు....అదో పిచ్చి సెంటిమెంటు. నూతిలో కప్పలా మెదడు చిన్నదై పోతుంది...."

విశ్వనాథం ఈ మారు ఆవేశ పడలేదు. తమ్ముడి చెయ్యి మెల్లిగా తొలిగించి, తిన్నగా పొలం కేసి నడిచివెళ్లాడు.

చంద్రశేఖరంలాటి మనుషుల మెదడు ప్రమాణం, బహుశా తన మెదడు ప్రమాణం కంటే పెద్దదే అయ్యుండవచ్చు! అంచేత అలాటి మెదళ్లు-సిటీలలోని రోగాలనీ, అందునా డబ్బున్న రోగాలనీ, తప్ప.... నయం చెయ్యలేవు.

* * * * *

ఇక ఆఖరు తమ్ముడు ఉమాపతి అగ్రికల్చరల్ కోర్సు చదువుతా నన్నప్పుడు, విశ్వనాథం ఏలాటి అభ్యంతరమూ చెప్పలేదు, ఆశలూ పెట్టుకో లేదు.

కానీ ఉమాపతే, పదే, పదే ఆవేశంగా చెబుతూండే వాడు, శలవు లకు వచ్చినప్పుడల్లా...."మనవూళ్ళో ఆధునిక వ్యవసాయాన్ని ప్రారంభింపజేస్తాను. కొత్త వ్యవసాయ పరికరాలు, కొత్తరకం సాగు పద్ధతులు, కొత్త కొత్త ఎరువుల వాడకం....ఎలా 'గ్రీన్ రెవెల్యూషన్' తేవొచ్చో-తేవాలో నిరూపిస్తాను. జిల్లా స్థాయిలో, మనగ్రామం ఆధునిక వ్యవసాయంలో మొదటి బహుమతి గెల్చుకొనేలా చేస్తాను !"

మొదట్లో అతగాడి మాటల మీద అట్టే నమ్మకం కలగకపోయినా, రాను రాను ఉమాపతి ఆవేశం చూస్తుంటే అడుగంటిన ఆశలు తిరిగి చిగురించటం మొదలెట్టాయి. ఈ ఒక్క తమ్ముడైనా తన ఆశలకు ఓ రూపం యివ్వగలిగితే—అంతే చాలు అనుకున్నాడు.

ఉమాపతి కోర్సు పూర్తయింది. ఆరునెలలుగా యిక్కడే వుంటు న్నాడు. కానీ అతగాడంటూ వచ్చిన మాటలు యింకా కార్యరూపం ధరించ లేదెందుకో.

హఠాత్తుగా వారం రోజులక్రితం బయట పడిపోయాడు. "నిన్ను నిరాశ పరచినందుకు క్షమించన్నయ్యా ! బస్తీ వాతావరణానికి అలవాటు పడ్డ నాకు – యిక్కడ దిక్కు తోచటం లేదు !"

విశ్వనాథం కంగారు పడ్డాడు. "నీ కిష్టమైన పొలాన్ని, నీఆధునిక వ్యవసాయ క్షేత్రంగా ఎన్నుకోరా తమ్ముడూ ! ప్రయోగాలు ప్రారంభించు. అప్పుడు తోచడం లేదన్న బాధే వుండదు !"

"ఊహూం !...." ఉమాపతి అసహనంగా తల విదిల్చాడు. "అవన్నీ-ఏమిటో పుస్తకాలలో ఊహలు, అనవసరపు ఆవేశాలు...."

విశ్వనాథం మాట్లాడ లేదు క్షణకాలం .... ఓడిపోతున్న వాడిలా తమ్ముడికేసి చూస్తూ చివరి ఆశాలేశానికి వూపిరిపోస్తూ అన్నాడు. "పోనీ

ఆ పుస్తకాల వూహలనే నిజం చెయ్యటానికి ఎందుకు ప్రయత్నించ కూడదు?"

ఉమాపతి పేలవంగా నవ్వాడు. "ఆ ప్రయత్నం వృధా శ్రమన్నయ్యా! నేనో ఆఫీసరునై, కాగితాల మీద అగ్రికల్చరల్ రెవల్యూషన్‌ను గురించి వ్రాస్తే నాకు డబ్బులొస్తాయి! ఆ పుస్తకాలు బాగా అమ్ముడుపోయి, రాయల్టీలు దండిగావస్తాయి! అసలు నేను చెప్పినా మన వూరి వాళ్లు వినరు! కారణం వాళ్ళ కళ్ళముందు పెరిగిన నేనూ, నా మాటా అట్టే విలువగా తోచవు.

అసలీ వ్యవసాయం నమ్ముకుని నువ్వేం బాగు పడ్డావు. హాయిగా కవులు కిచ్చి, కాలుమీద కాలు వేసుక్కూర్చో! ఈవయసులో ఈపశువులూ కూలీలూ, హైరానంతా నువ్వు పడలేవు. లేదా ఆస్తి అయిన ధరకు అమ్మి పారెయ్! ఆ డబ్బు వడ్డీల కిచ్చుకున్నావంటే — హాయిగా రోజులు గడిచి పోతాయి నిశ్చింతగా!"

విశ్వనాధం యిక మాట్లాడలేదు .... వారం రోజుల్లో ఉమాపతి బస్తీకి వెళ్ళి వచ్చి, ఇల్లూ అదీ చూచుకుని వచ్చాడు. ఈరోజు అతగాడూ వెళ్ళిపోతున్నాడు.

* * * * *

"బాబుగారూ! ఈ కయ్య కోత పూర్తయింది. దిగువ కయ్య కోస్తాం!" కూలీలు అరుస్తున్నారు.

విశ్వనాధం ఉలిక్కి పడ్డాడు. గత స్మృతులు చెల్లా చెదురుగా ఎగిరి పోయాయి.

"ఊ!" అంటూ తలెత్తి చుట్టూరా పరకాయించి చూశాడు.

దూరాన బండ్లబాటమీద, తమ రెండెడ్లబండి పోతోంది. అందులో ఉమాపతి వెళ్తున్నాడు!

"మీరు కోస్తుండండి, నేనలా బయలు ప్రదేశానికి వెళ్ళివస్తాను!" కూలీలతో చెప్పి, పశువుల బీడుకేసి నడిచాడు విశ్వనాథం.

బాగా ఎత్తుగా తిప్పలా వుంటుందా ప్రదేశం! అక్కణ్ణుంచి చూస్తే ఊరు అంతా కనిపిస్తుంది చిన్నదిగా! ఊరూ, ఊరి చుట్టూరా తాటిచెట్ల కర!

ఎందుకో వూరివేపు చూస్తున్న విశ్వనాథానికి-వూరంతా ఓ స్త్రీ మూర్తి ఆకారంలా కన్పించ సాగింది. పెద్దగాలి సుడులు తిరుగుతూ లేస్తోంది. తాటిచెట్లు, తుమ్మ చెట్లూ గాలికి తెగ వూగుతున్నాయి. ఊరు విరగబడి నవ్వుతున్నధ్వనిలా కర-కర, గల-గల మని శబ్దం వస్తోంది ...

విశ్వనాథానికి ఏదో మగత క్రమ్ముతున్నట్లుంది.

"అవునారి విశ్వం! నువ్వూ, నేనూ బాధపడి ప్రయోజనమేమిటి? నా ఒడిలో పుట్టారు-పెరిగారు. రెక్కలు రాగానే ఎగిరిపోయారు! నా మట్టీ, నీరూ, గాలీ వాళ్ళలో వివేకంతోబాటు అహాన్నికూడా పెంచింది! అందుకే 'వెధవ్వూరని' పదే-పదే తిట్టిపోస్తున్నారు! ఇప్పుడు నాకూ నవ్వు వస్తోంది. నాకోసం ఏఒక్క త్యాగమూ, త్యాగానికి ప్రయత్నమూ చెయ్యలేని ఈ వాజమ్మలంతా నన్ను తిడుతుంటే! పోనీ-ఇలాటివాళ్ళు నన్నుద్ధరించినా నాకు బాధేగాని సంతోషం కలగదు .. పోనీ - వాళ్ళని వెళ్ళనీ ... పదవుల్నీ, డబ్బునీ, అన్యాయాల్నీ – ఆస్తుల్నీ పట్టుకు ప్రాకు లాడనీ!

"అవేవీ తెలియని నా బిడ్డలు.... అదుగో ఆ పశువులున్నాయి. ఈ చెట్లున్నాయి. వాటిలో ఒకడిగా నువ్వున్నావు .... నువ్వేమీ చెయ్యలేక

పోవచ్చు! కానీ ఏదో చేయాలన్న అభిమానంతో పోరాడావు .... ఓడిపోయావు .... బాధపడకు .... "

రొద గాలి ఆగి, మెల్లిగా గాలి వీస్తోంది!

ఊరు మందహాసం చేస్తున్నట్లు - చల్లగా, హాయిగా, కన్నతల్లిలా తన వెన్ను నిమురుతున్నట్లు అనుభూతి ....

అలా ఎంతసేపు కూర్చుండి పోయాడో అతగాడు!

(" జ్యోతి " దీపావళి ప్రత్యేక సంచిక '71)